క్లుప్తంగా

నేడు కోదండ రామలింగేశ్వర పరస

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవాని పాలెంలో ఆదివారం కోదండ రామలింగేశ్వర స్వామి పరస జరగనుంది. దీనిలో భాగంగా రామాలయంలో తెల్లవారి నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం పరస మహోత్సవంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు,సేవ గరడీ, సాముగరడీ,డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రచయితగా సత్తిరాజుకు మంచి గుర్తింపు


సత్తిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

మల్కాపురం: తన రచనల ద్వారా ఎన్నో సామాజిక కోణాలను వెలుగులోకి తెచ్చిన గొప్ప వ్యక్తి కరుకు సత్తిరాజు అని ప్రముఖ చిత్రకారుడు సుంకర చలపతిరావు అన్నారు. కవి,రచయిత కరుకు సత్తిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం సంతాప నిర్వహించారు.మల్కాపురం శాఖ గ్రంథాలయ అధికారి అజేయ్ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పౌర హక్కుల సంఘం నేత తుంపాల శ్రీరామ్మూర్తి,కార్మిక నాయకులు బి.సత్యానందం,పాత్రికేయుడు నరసింహం,జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ గల్లా చిన్నా

గోపాలపట్నం/సింధియా/మల్కాపురం: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు పలు వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నాతో కలిసి పేదలకు చీరలు, పంపిణీ చేశారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 58, 59, 60,61వ వార్డుల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ గోపాలపట్నంలోని ఎమ్మెల్యే గణబాబు ఇంటి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

హోటల్ గదిలో యువకుడి మృతి


విగతజీవిగా ఉన్న జీవన్‌శర్మ

శృంగవరపుకోట: హోటల్ గదిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి చెందాడు. విజయనగరం జిల్లా కొత్తవలసకు కూతవేటు దూరంలో ఉన్న ఓ హోటల్‌లో విశాఖ ఎయిర్‌పోర్టు దరి విమాన్‌నగర్‌కు చెందిన యువకుడు శనివారం బసచేశాడు. సాయంత్రం హోటల్ సిబ్బంది గదిలో చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ షణ్ముఖరావు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా విమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన జీవన్‌శర్మగా గుర్తించారు. మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బిక్కు.. బిక్కు.. రక్షణ గోడలే దిక్కు!

గోపాలపట్నం బాజీ జంక్షన్ సమీపంలోని కొండవాలు ప్రాంతం ఇటీవల కురిసిన వర్షాలకు కుప్పకూలింది. పెను ప్రమాదం తప్పింది. ఇదే రీతిన జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌కు ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో కూడా కూలడంతో సమీప ఇళ్ల వారు భయకంపితులయ్యారు. వరుస ఘటనలతో నగర పాలక సంస్థ అధికారులు మేల్కొన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల ఆవశ్యకతను గుర్తించారు. ఈ రెండు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మాణానికి నిధులు కేటాయించారు.

- విశాఖ విద్య


కూలిన చోట నిర్మిస్తున్న రక్షణ గోడ

- బాజీ జంక్షన్ ఘటనతో మేల్కొన్న యంత్రాంగం
- కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం
- రూ. 2.18 కోట్లతో పనులు


శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్

బితుకు బితుకు మంటూ..

జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్–బ్లాక్‌కు ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో నిరుపేదలు, రోజు వారీ కూలీలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ సుమారు 250 ఇళ్లు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇదే చోట ఉంటున్న వీరికి మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో సమకూరలేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు కొండచరియలు జారి పడతాయనే భయంతో ప్రజలు బితుకు బితుకు మంటూ కాలం వెల్లదీయాల్సిన దుస్థితి. బతుకు దెరువుకోసం రోజువారీ కూలిపనులకు వెళ్లి ఇంటికి వచ్చినా ఎప్పుడు ఏ బండరాయి వచ్చి పడుతుందోనని ఇక్కడి ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

ఎన్నో సంవత్సరాల కిందట నిర్మించిన అంతర్గత రహదారులే వారి రాకపోకలకు మార్గం. దిగువకు వచ్చేందుకు అందుబాటులో ఉన్న మెట్ల మార్గం కూడా పలు చోట్ల పాడైంది. వర్షాకాలంలో కొండపై నుంచి వచ్చే నీటి ప్రవాహనం సజావుగా కిందకు పోయేలా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొండవాలు ప్రాంత వాసులు వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం అందుబాటులో ఉన్న కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరింది.


అధ్వానంగా ఉన్న మెట్ల మార్గం

ఆందోళనతో జీవిస్తున్నాం

30 ఏళ్ల నుంచి కొండవాలు ప్రాంతంలో ఉంటున్నాం. మా ఇంటి ముందు నుంచి ఉన్న దారి గుండా పైన ఉన్న ఇళ్ల వారు రాకపోకలు సాగించాలి. మొన్న వర్షాలకు దారి కూలిపోయింది. మా ఇళ్లు కూడా కూలిపోతుందేమోనని ఎంతో భయపడ్డాం. నిత్యం ఆందోళనతో బతుకుతున్న మా సమస్యలను అధికారులు పట్టించుకొని సౌకర్యాలు కల్పించాలి. – నేతల కళావతి

మౌలిక సౌకర్యాలపై దృష్టి

లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంత సమస్యలపై దృష్టి పెట్టాం. అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేని మాట వాస్తవం. వీటిని మెరుగుపరిచేందుకు రూ.1.38 కోట్లు మంజూరయ్యాయి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతాం.

– బొమ్మిడి రమణ, కార్పొరేటర్

రక్షణ గోడలు పటిష్టంగా నిర్మిస్తాం

కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడలను పటిష్టంగా నిర్మించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ పనులను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేస్తాం. ఇంకా ఎన్ని చోట్ల రక్షణ గోడలు నిర్మించాలో పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– వెంకటలక్ష్మి, జోన్–8 పబ్లిక్ వర్క్స్ ఏఈ

ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం


చేపడుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులు

జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ప్రాధాన్యతను గుర్తించిన జీవీఎంసీ అధికారులు రక్షణ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఇటీవల వర్షాలకు కుంగిన ప్రాంతాలను గుర్తించి ఐదు చోట్ల రక్షణ గోడల నిర్మాణం కోసం రూ. 2.18 కోట్లు మంజూరు చేశారు. వీటిలో మూడు చోట్ల ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52 వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. న్యూకరాస ప్రాంతంలో సీసీ రోడ్లు , కాలువల నిర్మాణ పనులు పరిశీలించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ ఉష, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం కరపత్రం విడుదల


కరపత్రాన్ని విడుదల చేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మల్కాపురం: రిపబ్లిక్ డే సందర్భంగా 60వ వార్డు గుల్లలపాలెంలో వార్డు కార్పొరేటర్, పి.వి.ఎస్. హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న మెగా రక్తదానం శిబిరం పోస్టర్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించడం మంచి విషయం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు గుంట సుందరరావు,పూండి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య కొట్లాట

ఇద్దరికి గాయాలు


గాయపడిన షేక్ మొయిద్దీన్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్ సామిల్లు వద్ద శుక్రవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఒక బైక్ ధ్వంసమైంది.

గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్‌లో నివాసముంటున్న షేక్ మొయిద్దీన్ తన సమీప బంధువుఅయిన షేక్‌మీరాతో మేడపై ఉన్నారు. శుక్రవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో కొందరు యువకులు బొడ్డేటిబాబు, భరత్ తులసి తదితరులు షేక్ మీరా ద్విచక్రవాహనం వద్ద ఉన్నారు. ఇది గమనించి మీరెవరూ.. ఎందుకు ఇక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. దీంతో మాటా మాటా పెరిగి వివాదానికి దారి తీసింది. అయితే కొద్ది సేపటికి సద్దమణిగినట్లు అయినా


దాడిలో ధ్వంసమైన ద్విచక్రవాహనం

బాలు స్నేహితులతో కలసి వచ్చి మళ్లీ దాడికిపాల్పడ్డారు. దీంతో షేక్ మొయిద్దీన్ తలకి గాయాలయ్యాయి. బయట ఉన్న బైక్‌ను ధ్వంసం చేశారు. 100 డయల్ చేయడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. పోలీసుల రాకతో దాడికి పాల్పడిన వారంతా పరారయ్యారు. ఉదయం ఘటనా స్థలానికి ఎస్ఐ అప్పలనాయుడు వెళ్లి వివరాలు సేకరించారు. దీనిపై ఇరువర్గాలు ఫిర్యాదు చేశాయి. షేక్ మొయిద్దీన్, షేక్ మీరాలను, మరో వర్గానికి చెందిన బొడ్డేటి బాలు, భరత్ తులసి, ఇల్లపు సాయి, రాజు, నందులను అదుపులోకి తీసుకున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఏఎంసీ మహిళా హాస్టల్లో చోరీ

- 4 సెల్‌ఫోన్లు తస్కరించిన యువతి
- ఆమెను పట్టుకుని సెల్‌ఫోన్లు లాక్కున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కాలేజీ మహిళా హాస్టల్లో చోరీ జరిగింది. విలువైన నాలుగు సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడ్డ యువతి వైద్య విద్యార్థినిగా హాస్టల్లోకి ప్రవేశించింది. సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతున్న దృశ్యాన్ని పలువురు వైద్య విద్యార్థినులు పసిగట్టి.. ఆ యువతి నుంచి సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ఆంధ్రా మెడికల్ కళాశాల వుమెన్స్ హాస్టల్లోకి రంగిరీజు వీధికి చెందిన ఓ యువతి వైద్య విద్యార్థినిగా లోపలికి చొరబడింది. హాస్టల్లోని పలు గదులను చెక్ చేసుకుంటూ విద్యార్థినులు లేని గదుల్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు దొంగలించింది. ఆ యువతి సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతుండడంతో పలువురు


ఆంధ్రా మెడికల్ కళాశాల మహిళా హాస్టల్

వైద్య విద్యార్థినులు పసిగట్టి ఆ యువతిని పట్టుకున్నారు. దొంగలించబడ్డ నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూరిటీ సిబ్బంది ఎక్కడ?

ఆ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నట్టా? లేనట్టా? అనేది అనుమానంగా ఉంది. సెల్‌ఫోన్లు దొంగిలించేందుకు హాస్టల్లోకి వెళ్లాలంటే అక్కడ విధులు నిర్వర్తించే ఓ మహిళా సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. అటువంటిది అక్కడ ఉన్న మహిళా సెక్యూరిటీని తప్పుదోవ పట్టించిందో.. లేదా వైద్య విద్యార్థినిగా లోపలికి ప్రవేశించిందో తెలియదు గానీ.. ఆ యువతి హుందాగా వెళ్లి.. సీసీ కెమెరా ద్వారా దొంగగా దొరికిపోయింది.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

డాబాగార్డెన్స్: జనక్రాంతి ట్రస్ట్ సహకారంతో డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నడిచే కేంద్రాల్లో శిక్షణ పొందడం వల్ల నైపుణ్యంతో పాటు పోటీ ప్రపంచానికి కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా అందుతుందన్నారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ జనక్రాంతి ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ శివప్రసాద్ శిక్షణ తరగతులకు కావల్సిన రూ.10 లక్షల విలువ గల కంప్యూటర్స్‌ను అందజేశారని తెలిపారు.


సెంటర్‌ను ప్రారంభించి నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకుడు ఎల్లాజీ మాట్లాడుతూ ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్, అకౌంటింగ్, మల్టీ మీడియా వంటి సోషల్ మీడియాకు సంబంధించిన కోర్సులు నామమాత్రపు రుసుంతో రోజుకు 4 షిఫ్టుల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ నిర్వహణ బాధ్యులు జీఎస్ రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, కామేశ్వరరావు, ఎమ్మారెడ్డి రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

డీసీసీబీ సీఈవో వర్మ


డీసీసీబీ కార్యాలయానికి వెళ్లే దారిని శుభ్రం చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

విశాఖ విద్య: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో డి.వి.ఎస్. వర్మ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మర్రిపాలెంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కేంద్ర కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. సీఈవో డి.వి.ఎస్. వర్మ ఆధ్వర్యంలో బ్యాంకు సమీపంలోని రహదారులను అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీఈవో వర్మ మాట్లాడుతూ కేంద్ర కార్యాలయంతో పాటు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 31 బ్రాంచ్ కార్యాలయాలు, 98 పీఏసీఎస్‌లలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, సమాజ హితం కోసం పరిశుభ్రతా కార్యక్రమాల్లో సైతం బ్యాంకు అధికారులు,సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జీఎంలు అన్నపూర్ణ ,శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత మన బాధ్యత

గోపాలపట్నం: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని గోపాలపట్నం రైతు బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్ అన్నారు. రైతు బజారులో శనివారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. రైతులు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు కలసి రైతు బజారు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడరాదని, వినియోగదారులు కూడా గుడ్డ సంచులు తీసుకు రావాలని కోరారు.

➡ జీవీఎంసీ 92వ వార్డు వుడా కాలనీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. దాడి రమేష్ నాయుడు, ఎస్ఎస్ వెంకటరమణ మాట్లాడుతూ మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే మన గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు.


గోపాలపట్నం రైతు బజారులో..


వుడా కాలనీలో పార్కును శుభ్రం చేస్తున్న జీవీఎంసీ అధికారులు, నాయకులు


పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న నాయకులు


58వ వార్డు పరిధిలో..

62వ వార్డులో.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలలో శనివారం శానిటరీ సిబ్బంది ఆధ్వర్యంలో పరిశుభ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పలు వార్డుల్లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేర పారిశ్రామిక ప్రాంతంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. 58వ వార్డులో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శీరం ఉమామహేశ్వరి,పోతాబత్తుల శ్రీను తదితరులు శ్రీహరిపురం,పిలకవానిపాలెం పరిసరాలను పరిశుభ్రం చేశారు.

➡ 61వ వార్డు పరిధి మల్కాపురంలో జరిగిన కార్యక్రమంలో మజ్జి సోమేష్ తదితరులు పాల్గొన్నారు. 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో రోడ్లను శుభ్రం చేశారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులోని బాజీ జంక్షన్ సంత వెనుక శ్రీనివాస్ నగర్‌లో ఉన్న పంచతత్వ పార్కులో శనివారం స్వచ్ఛ దినోత్సవం నిర్వహించారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛ దివస్‌లో పాల్గొనాలన్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్క్ కమిటీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీధర్, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్ రమణ తదితరులు

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.